క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు


అభిషేకాలు అందుకుంటున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

పరిశుభ్రతతో డయేరియాకు కళ్లెం


పందలపాకలో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ఎం అనంతలక్ష్మి

బిక్కవోలు: పరిశుభ్రత పాటించడం ద్వారా డయేరియాకు కళ్లెం వేయొచ్చని ఏఎన్‌ఎం కె.అనంతలక్ష్మి అన్నారు. మంగళవారం పందలపాక గ్రామ సచివాలయం–1 పరిధిలో కట్టమ్మ తల్లి గుడి వద్ద డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం కె.అనంతలక్ష్మి మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని, దోమ కాటుకు గురవకుండా దోమ తెరలను వినియోగించాలని సూచించారు.

ఘనంగా రొట్టెల పండగ


విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న రెవరెండ్ దివాకర్

పెదపూడి: మండలంలోని ఏపీత్రయం గ్రామంలో బెరాక స్వస్థతశాల చర్చిలో రెవరెండ్ దివాకర్ ఆధ్వర్యంలో మంగళవారం రొట్టెల పండగను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ విజయ కుమార్ ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి రొట్టెల పండగ ప్రత్యేకతను ఉపదేశించారు. అనంతరం చిన్నారులు, యువత, పెద్దలకు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, ఇతర విద్యా సామగ్రి అందజేశారు. చర్చిలో ఏర్పాటుచేసిన ప్రేమ విందులో భక్తులు పాల్గొని భోజనాలు చేశారు.

ప్రైవేట్ స్కూళ్లు తనిఖీ చేసిన ఆర్డీఓ


దానవాయిపేటలోని ప్రైవేట్ స్కూలును తనిఖీ చేస్తున్న ఆర్డీఓ చైత్రవర్షిణి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నగరంలోని ప్రైవేట్ స్కూళ్లను ఆర్డీఓ చైత్రవర్షిణి మంగళవారం తనిఖీ చేశారు. ఉత్తర్వుల మేరకు ఫ్రీ సీట్లలో చేరిన విద్యార్థులకు అందజేస్తున్న విద్యా బోధన విధానాన్ని పరిశీలించారు. స్థానిక లిటిల్ ప్యారడైజ్ స్కూల్‌ను డీఎస్‌ఈఓ కె.వాసుదేవరావు, ఇతర అధికారులతో కలసి ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఉచిత సీట్లలో చేరిన విద్యార్థులకు జరుగుతున్న విద్యా బోధనపై పలు అంశాలను పరిశీలించామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు చేపట్టినట్టు చెప్పారు. చిన్నారులతో మాట్లాడి వివరాలు సేకరించామన్నారు. ప్రైవేటు స్కూళ్లలో కొన్ని సీట్లను ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలకు తప్పనిసరిగా కేటాయించిందన్నారు. వారికి ఇతర పిల్లలతో సమానంగా విద్యా బోధన ఇవ్వాల్సిన నైతిక, సామాజిక బాధ్యత అందరికీ ఉందని స్పష్టం చేశారు.

ఎల్‌ఐసీ అభివృద్ధిలో ఉద్యోగులే కీలకం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ) అభివృద్ధికి ఉద్యోగులు ఎల్లప్పుడూ ముందుంటారని, పాలసీదారుల ప్రయోజనాలు కాపాడటంలో సంస్థ అగ్రగామిగా ఉందని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా.గుబ్బల రాంబాబు, ఎం.కోదండరామ్ అన్నారు. మంగళవారం సంఘ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని మోరంపూడిలోని ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించారు. నాలుగేళ్లుగా ఖాళీగా ఉన్న 2,700 క్లాస్–3, 4 ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరుతూ డివిజనల్ ఎస్‌డీఎం కె.సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు.

భద్రంగా.. సహకారం

- సొసైటీల్లోని సమాచారమంతా కంప్యూటరీకరణ
- సభ్యుల ఈ–కేవైసీ తప్పనిసరి
- కొనసాగుతున్న అనుసంధాన ప్రక్రియ
- పూర్తయితే సేవలన్నీ సరళతరం


వంగలపూడిలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం

రాజానగరం: అన్నదాతలకు ఆర్థికంగా అండగా ఉంటూ, వారి సాగు అవసరాలను తీరుస్తూ, వ్యవసాయాభివృద్ధిలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కీలక పాత్రను పోషిస్తున్నాయి. సీజన్ల వారీగా వివిధ రకాల పంటలను పండించేందుకు వీలుగా అవసరమైన రుణాలందిస్తూ తోడ్పాటు నిస్తున్నాయి. ఈ సంఘాల ద్వారా అందిస్తున్న సేవలను పొందడంలో కొన్నిచోట్ల, కొంతమంది స్వార్థపరులు రైతుల కష్టాన్ని కాజేసేలా చేతివాటం చూపుతూ కర్షకులకు తీరని కష్టనష్టాలను మిగుల్చుతున్నారు. వీటికి చెక్ పెట్టి, పారదర్శకంగా సేవలను అందించే దిశగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా (సొసైటీ)లను పూర్తి స్థాయిలో కంప్యూటరీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలిచ్చాయి. అందుకనుగుణంగా ఆయా సొసైటీల్లో కంప్యూటరీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

జరగని అనుసంధానం

ఇప్పటికే రెండంచెల్లో ఉన్న రాష్ట్ర సహకార బ్యాంకులు (ఎస్‌టీసీబీ), జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లను నాబార్డ్ ద్వారా కంప్యూటీకరణ చేశారు. వీటిని కామన్ బ్యాంకింగ్ సాఫ్ట్‌వేర్ (సీబీఎస్) పరిధిలోకి తీసుకువచ్చారు. మూడో అంచెగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో మాత్రం కంప్యూటరీకరణ పూర్తి స్థాయిలో జరగలేదు. ఎక్కువ శాతం సంఘాలు సిబ్బంది ద్వారానే కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. ఏ సంఘానికి ఆ సొసైటీలోనే కంప్యూటరీకరణ జరగడంతో, ఈ సంఘాలతో ఎస్‌టీసీబీ, డీసీసీబీలతో అనుసంధాన ప్రక్రియకు అవకాశం లేకుండా పోయింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని సంఘాలను కంప్యూటరీకరించాలని, జాతీయ స్థాయిలో ఒక ఉమ్మడి వేదిక పైకి తీసుకురావాలని, రోజు వారీ వ్యాపారం, కామన్ అకౌంటింగ్ సిస్టం కలిగి ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయి కంప్యూటరీకణకు నడుం బిగించాయి.

ప్రయోజనాలివే..

కంప్యూటరీకరణ వలన ఆర్థిక సమగ్రత కల్పించడంతో పాటు, రైతులకు ప్రత్యేకించి చిన్న, సన్నకారు రైతులకు అందిస్తున్న వివిధ సేవలు, ఎరువులు, విత్తనాలు తదితర వాటి ఇన్‌పుట్‌లను అందించడానికి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు నోడల్ సర్వీస్ డెలివరీ పాయింట్‌గా మారేందుకు అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్‌ను మెరుగుపర్చడమే కాకుండా, బ్యాంకింగ్ కార్యకలాపాలకు, అలాగే బ్యాంకింగేతర కార్యకలాపాలకు అవుట్‌లెట్లుగా ఈ సంఘాల సేవలు విస్తరిస్తాయి. ఆయా సంఘాల ద్వారా అమలు చేసే వివిధ ప్రభుత్వ పథకాలను (క్రెడిట్, సబ్సిడీలతో ముడిపడి ఉన్నవి) చేపట్టేందుకు డీసీసీబీలకు వీలవుతుంది. రుణాలు వేగవంతంగా మంజూరు కావడానికి, ఆడిట్, చెల్లింపుల్లో అసమతుల్యత తగ్గింపును నిర్ధారిస్తుంది. సంఘ సభ్యులు తమ అకౌంటింగ్ వివరాలను ఇంటి వద్దే ఉండి ఆన్‌లైన్‌లో తెలుసుకునేందుకు దోహదపడుతుంది.

ఈ–కేవైసీ చేయించాలి

సహకార పరపతి సంఘాల్లో చేపట్టిన కంప్యూటరీకరణలో భాగంగా సభ్యులందరూ ఈ–కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) చేయించుకోవాల్సి ఉంది. ఇందుకు ప్రతి సభ్యుడు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో పాటు, ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్సులతో పాటు, సెల్‌ఫోన్ నంబరు, నామినీ పేరును ఆయా సంఘాలకు అందించి ఈ–కేవైసీ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలి. ఈ ప్రక్రియ పూర్తయితే ఆన్‌లైన్‌లో ప్రతి సభ్యుడు ఆయా సొసైటీల పరంగా తన పూర్తి వివరాలను స్వయంగా తెలుసుకునే వీలుంటుంది. బ్యాంకుల్లాగే రుణాల చెల్లింపులు, మంజూరు సమయంలో ఆయా వ్యక్తుల వివరాలు తెలుసుకునేందుకు కూడా అవకాశం ఉంటుంది.

సభ్యులకెంతో మేలు



వ్యవసాయ సహకార పరపతి సంఘాలను పూర్తి స్థాయిలో కంప్యూటరీకరించడం వలన సభ్యులకు ఎంతో మేలు జరుగుతుంది. వాణిజ్య బ్యాంకులు ఏనాడో ఈ ప్రక్రియను పూర్తి చేసి, కస్టమర్లకు మెరుగైన సేవలను అందిస్తున్నాయి. సహకార పరపతి సంఘాలకు ఈ అవకాశం ఇంతవరకూ లేదు, ఈ ప్రక్రియ పూర్తయితే బ్యాంకులతో సమానంగా సేవలను విస్తతపర్చవచ్చు, మరింత అభివృద్ధిని సాధించవచ్చు.

– దేవలంక శ్రీరామమూర్తి, నందరాడ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు, నరేంద్రపురం

సమయం వృథా కాదు



సభ్యులంతా ఈ–కేవైసీని తప్పనిసరిగా చేయించుకోవాలి. ఇంతవరకు సంఘాలు వేటికవే సొంత సాఫ్ట్‌వేర్‌ని వినియోగించి, ఆయా సంఘాలకు సంబంధించిన వివరాలను ఎంట్రీ చేసుకున్నాయి. దీనివల్ల ఆన్‌లైన్ ప్రక్రియకు అవకాశం లేకుండా పోయింది. కనీసం డీసీసీబీకి అనుసంధానం కాలేదు. ఈ కారణంగా వాళ్ల ఏ వివరాలు అడిగినా సంఘంలోని సాఫ్ట్‌వేర్ నుంచి డౌన్‌లోడ్ చేసి, అందించాల్సి వస్తోంది. పూర్తి స్థాయి కంప్యూటరీకరణ వలన ఇకపై ఆ సమస్యలుండవు. సభ్యులకు కూడా రుణాలు పొందడంలోను, చెల్లింపుల్లోను సమయం వృథా కాదు.

– నల్లమిల్లి దుర్గారావు, సీఈఓ, కానవరం సహకార పరపతి సంఘం

సర్పంచ్ చొరవతో రోడ్డుకు మరమ్మతులు


మర్రిపూడి–పెద్దాపురం రోడ్డుపై నల్ల కంకర వేసి చదును చేస్తున్న కూలీలు

రంగంపేట: మండల పరిధిలోని మర్రిపూడి గ్రామంలో గ్రామ సర్పంచ్ వేము మాధవి చొరవతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మర్రిపూడి నుంచి పెద్దాపురం వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైందన్నారు. దీనికి తోడు వర్షాలు కురుస్తుండటంతో గోతుల్లో నీరుచేరి బురదమయంగా మారడంతో రాకపోకలకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే ట్రాక్టర్లతో నల్ల కంకర క్రషర్ తరలించి రోడ్డును చదును చేయిస్తున్నానని ఆమె తెలిపారు.

సొసైటీల్లో కంప్యూటరీకరణ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం, రాపాక, రఘుదేవపురం, ముగ్గళ్ల సొసైటీల్లోని సభ్యులు తమ వివరాలను తప్పనిసరిగా కంప్యూటరీకరణ చేయించుకోవాలని ఆయా పీఏసీఎస్‌ల సీఈఓలు లక్ష్మణరావు, కాట్నం వెంకటేశ్వరరావు, ఎం.రామకృష్ణ, కాట్నం గణేష్ మంగళవారం కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆయా సొసైటీల పరిధిలోని సీతానగరం, నాగరత్నం కాలనీ, రాపాక, నల్గొండ, రఘుదేవపురం, ముగ్గళ్లలోని సభ్యుల రికార్డులను కంప్యూటరీకరణ చేస్తున్నామని చెప్పారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాను నియంత్రించాలి


పెదపూడి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రాజబాబు తదితరులు

పెదపూడి: ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా ప్రభుత్వం నిరుపేదలకు పంపిణీ చేస్తున్న బియ్యం అక్రమ రవాణాను నియంత్రించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం(ఏపీఆర్‌సీఎస్) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ అధ్యక్షుడు వి.రాజబాబు కోరారు. ఈ మేరకు పెదపూడి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ పీడీఎస్ బియ్యం నిరుపేదలకు అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తూ కొంతమంది అక్రమార్కులు యథేచ్ఛగా బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్నారంటూ ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా ప్రతినిధులు మడికి సత్యం, ఎ.సత్తిబాబు, జానకి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలి


రమణమూర్తిని సత్కరించిన ఈఓ వడ్డాది సత్యనారాయణ

పెదపూడి: విధి నిర్వహణలో ప్రతిఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని పెదపూడి గ్రూప్ ఆలయాల ఈఓ వడ్డాది సత్యనారాయణ తెలిపారు. పుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన చీమలకొండ వెంకటరమణమూర్తికి అభినందన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డాది సత్యనారాయణ మాట్లాడుతూ ఆలయ ఈఓగా రమణమూర్తి నిస్వార్థ సేవలందించి ప్రజాదరణ పొందారన్నారు. ఆయన నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకిత భావంతో పనిచేసేవారని కొనియాడారు. అనంతరం రమణమూర్తికి శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కామన సుబ్బారావు, శంకర్, కాసులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ 99 శాతం పూర్తి

పెదపూడి: మండలంలోని 20 సచివాలయాల్లో మంగళవారం సామాజిక పింఛన్ల పంపిణీ 99 శాతం మేర పూర్తయిందని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి తెలిపారు. మంగళవారం ఆమె పెదపూడి, జి.మామిడాడ గ్రామాల్లో పర్యటించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 10,645 పింఛన్లకు గాను 10,542 పింఛన్ల పంపిణీ పూర్తయిందని చెప్పారు. మిగిలినవి వీలైనంత త్వరగా పంపిణీ చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శి మన్యం శ్రీనివాసుచౌదరి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ 98.87 శాతం పూర్తి

రంగంపేట: మండలంలో పింఛన్ల పంపిణీ 98.87 శాతం పూర్తయిందని ఎంపీడీఓ పి. వెంకటరత్నం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 9,035 మంది లబ్ధిదారులకు గాను రూ.6.83 కోట్లు మంజూరు అయ్యాయన్నారు.

డెంగీతో ప్రాణాపాయం


సీతానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

సీతానగరం: డెంగీతో ప్లేట్‌లెట్ల సంఖ్య క్షీణించి, ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా సీతానగరంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి పాత పోలీస్ స్టేషన్, బస్టాండ్ సెంటర్, నాలుగు బొమ్మల సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ డెంగీని అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందన్నారు. దోమల వృద్ధికి కారణమయ్యే ఇంటి లోపల, బయటా నీటి నిల్వలు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత టైర్లు, కొబ్బరి డొక్కుల్లేకుండా చూడాలన్నారు. నీటి, పూల కుండీల్లో మూడు రోజులకు మించి నీటి నిల్వ ఉంచరాదన్నారు. దోమ తెరలు వాడాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని చెప్పారు. కొద్దిపాటి జ్వరం వచ్చినా అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

15న బహిరంగ వేలం

రాజమహేంద్రవరం సిటీ: గోషాయి మఠం, నంది మంటపం, గోదావరి మాత ఆలయాల్లో భక్తులు సమర్పించే కొబ్బరి చెక్కలు, రవికలు, చీరెలు ఈ ఏడాది (2024–25) జూలై 26 నుంచి ఏడాది పాటు సేకరించుకునే హక్కులకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ నెల 15న ఉదయం 10 గంటలకు మఠం కార్యాలయం వద్ద ఈ వేలం జరుగుతుందని మఠం కార్యనిర్వహణాధికారి పి.తారకేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మఠం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రోటరీ రివర్ సిటీ అధ్యక్షుడిగా నరసింహారావు


ఎన్నికైన నూతన కార్యవర్గమిదే..

రాజమహేంద్రవరం సిటీ: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ నూతన అధ్యక్షుడిగా నాళం నరసింహారావు ఎన్నికయ్యారు. మంగళవారం జేఎన్ రోడ్ ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాల్‌లో క్లబ్ 2024–25కు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇంకా కార్యదర్శిగా కనకం చంద్రశేఖరరావు, కోశాధికారిగా నూలి శివమల్లికార్జున, పలువురు కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. రోటరీ పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్కరాజు సత్యనారాయణ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మహిళలకు కుట్టు మెషీన్లు, హియరింగ్ ఎయిడ్స్, విద్యార్థులకు పుస్తకాలు, క్రికెట్ బ్యాట్లు, విద్యార్థులకు పారితోషికాలు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ సుంకర నాగేంద్రకిషోర్, నూతన అసిస్టెంట్ గవర్నర్ పీఎస్ఎస్ దొరబాబు, రివర్ సిటీ పూర్వ అధ్యక్షుడు మద్దూరి శివసుబ్బారావు, గాదె కిషోర్, ఇనుమర్తి రామకృష్ణారావు బచ్చు సత్యానందం, బూర్లగడ్డ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోటి ఆనందాల ధామం

సాయం సంధ్యవేళ.. గోదారి తీరాన.. ప్రకృతి అందాలు తిలకిస్తూ కుటుంబ సమేతంగా గడిపే ఆ క్షణాలు ఎంతో మధురానుభూతులు మిగులుస్తాయి. అత్యాధునిక సౌకర్యాలతో ఆ ఆనందాలనే నిజం చేసేలా నగరపాలక సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యాచరణ ప్రణాళిక దాదాపు పూర్తి కావచ్చింది. మరికొద్ది రోజుల్లో ఆధునిక వసతులతో రూపుదిద్దుకున్న కోటిలింగాల ఘాట్ రిక్రియేషన్ స్పాట్ నగర ప్రజలకు అందుబాటులోకి రానుంది.

- నగరంలో రిక్రియేషన్ స్పాట్‌గా కోటిలింగాల ఘాట్
- చకచకా ఏర్పాట్లు చేస్తున్న నగరపాలక సంస్థ
- రూ.1.80 కోట్లతో నిర్మాణాలు
- మరికొద్ది రోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధం


కోటిలింగాల ఘాట్‌లో నిర్మాణమవుతున్న రిక్రియేషన్ స్పాట్

రాజమహేంద్రవరం సిటీ: పర్యాటకులు, సందర్శకులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని అందించేందుకు మరో వేదిక సిద్ధమవుతోంది. అప్పట్లో రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ మంజూరు చేసిన రూ.1.80 కోట్ల ఎంపీ ల్యాడ్స్‌తో రిక్రియేషన్ స్పాట్ పేరుతో నగరపాలక సంస్థ స్థానిక కోటిలింగాల ఘాట్ ప్రాంతాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తోంది. తొలుత ఈ రిక్రియేషన్ స్పాట్‌ను స్థానిక పుష్కరఘాట్ సమీపంలోని చిత్రాంగి గెస్ట్‌హౌస్ వద్దనున్న స్థలంలో ఏర్పాటు చేసేందుకు పరిశీలించారు. సాంకేతిక కారణాలు, రైల్వే శాఖ అభ్యంతరాల నేపథ్యంలో దీని స్థానే కోటిలింగాల ఘాట్‌ను ఎంచుకున్నారు. ఈ మేరకు నిర్మాణ పనులు చేపట్టేందుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. దేశంలో అతిపెద్ద గోదావరి ఘాటుగా పేరొందిన కోటిలింగాల ఘాట్‌లో ఈ రిక్రియేషన్ స్పాట్‌ను అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. పర్యాటకులు, సందర్శకులు, నగర ప్రజలు గోదావరి అందాలను తిలకిస్తూ.. ఆనందాన్ని ఆహ్లాదాన్ని పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

అత్యాధునికంగా..

గోదావరి ఒడ్డున వినూత్న తరహాలో అత్యాధునికంగా రెండు కాఫిటేరియాలను నిర్మిస్తున్నారు. కోటిలింగాల ఘాట్‌కు వచ్చే సందర్శకులు గోదావరి ఒడ్డున కూర్చుని, ఆహ్లాదకర వాతావరణంలో గోదావరి అందాలను తిలకించేలా రూపొందిస్తున్నారు. రిక్రియేషన్ స్పాట్‌లో భాగంగా కోటిలింగాల ఘాట్‌లో పది షాపులను కూడా నిర్మిస్తున్నారు. ఘాట్‌కు వచ్చే భక్తులు, పర్యాటకులు, సందర్శకులకు అవసరమైన ఆహారం, శీతల పానీయాలు అందించేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో ఇప్పటివరకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అర్బన్ ఫుడ్ ప్లాజా నెలకొల్పారు. దాని తరహాలోనే సందర్శకులకు అవసరమైన ఆహార పదార్థాలను అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. షాపుల్లో కొనుగోలు చేసిన ఆహార పదార్థాలను సందర్శకులు గోదావరి చెంతనే కూర్చుని ఆస్వాదించేలా నిర్మాణాలు జరుగుతున్నాయి.

కొద్ది రోజుల్లో సిద్ధం




నగరంలో సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించేందుకు మరో వేదిక సిద్ధం చేస్తున్నాం. ప్రతిష్టాత్మకమైన కోటిలింగాల ఘాట్‌కు వైభవాన్ని తీసుకొచ్చేందుకు నూతన హంగులతో రిక్రియేషన్ స్పాట్ సిద్ధం చేస్తున్నాం. మాజీ ఎంపీ భరత్‌రామ్ అప్పట్లో రూ.1.80 కోట్ల ఎంపీ నిధులు మంజూరు చేశారు. శరవేగంగా జరుగుతున్న ఈ నిర్మాణాలు కొద్ది రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నాం. ఘాట్‌లో సందర్శకుల కోసం పది షాపులు కూడా ఏర్పాటు చేస్తున్నాం.

– దినేష్‌కుమార్, కమిషనర్, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

ప్రత్యేక ఏర్పాట్లు

ఘాట్‌కు వచ్చే సందర్శకులు కూర్చునేందుకు అవసరమైన సిట్టింగ్ అరేంజ్‌మెంట్లు ఉన్నాయి. అలాగే ఘాట్‌లో విద్యుద్దీపాలతో ప్రత్యేక అలంకరణ ఏర్పాట్లూ చేస్తున్నారు. నగర ప్రజలకు ఆనందాన్ని అందుబాటులో తెచ్చేందుకు కోటిలింగాలు ఘాట్ వైభవాన్ని పెంచేలా ఈ అభివృద్ధి కార్యక్రమా లు చేపడుతున్నట్టు నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. నూతనంగా రూపుదిద్దుకుంటున్న రిక్రియేషన్ స్పాట్ నగర ప్రజలు, పర్యాటకులు, సందర్శకులను ఆకట్టుకుంటుందని అంటున్నారు. ఇది పూర్తయితే నగరంలో మరో నూతన పర్యాటక కేంద్రంగా కోటిలింగాల ఘాట్ మారుతుందనడంలో సందేహం లేదని నగర ప్రజలు చెబుతున్నారు.


నిర్మాణంలో ఉన్న దుకాణాలు


సందర్శకుల కోసం సిట్టింగ్ ఏర్పాట్లు